ప్రజాశక్తి
శనివారం 27 డిసెంబర్ 2025



31నే పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరంకోట

సామాజిక పింఛను దారులకు రాష్ట్ర ప్రభుత్వం నూతన సంవత్సర కానుకను ప్రకటించింది. జనవరి 1కు బదులుగా ఒకరోజు ముందుగా ఈ నెల 31నే ఎన్‌టిఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆరోజు ఉదయం 7 గంటలు నుంచి గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది లబ్దిదారుల ఇళ్లకు వచ్చి పింఛన్లను అందజేస్తారని తెలిపారు. డిసెంబరు నెలకు గాను జిల్లాలో 2,71,697 మంది పింఛన్ దారులకు మొత్తం రూ.116.25 కోట్లు విడుదల చేసినట్లు చెప్పారు. సంబంధిత సచివాలయాల సిబ్బంది నగదును బ్యాంకుల నుంచి విత్‌డ్రా చేసుకొని, పింఛన్ల పంపిణీకి సిద్దంగా ఉండాలని ఆదేశించారు.

ప్రజాదర్బార్‌లో అర్జీల వెల్లువ



ప్రజాదర్బార్‌లో అర్జీలు స్వీకరిస్తున్న బొబ్బిలి ఎమ్మెల్యే బేబినాయన

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యేలు నిర్వహిస్తున్న ప్రజాదర్బార్ కార్యక్రమానికి అర్జీలు వెల్లువలా వస్తున్నాయి. బొబ్బిలి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే బేబినాయన ప్రజాదర్బార్ నిర్వహించారు. గొల్లపల్లి రోడ్డుకు ఇరువైపులా కాలువలు నిర్మించి తాగునీటి సమస్య పరిష్కరించాలని కౌన్సిలర్ సావు శారద వినతిపత్రం అందజేశారు. తాగునీరు, రోడ్లు, కాలువ సమస్యలు పరిష్కరించాలని వినతులు అందాయి. మున్సిపల్, విద్యుత్ శాఖ సమస్యలపై ఎక్కువ ఫిర్యాదులు అందాయి. మొత్తం 87 వినతులు వచ్చాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని ఎమ్మెల్యే అన్నారు. ప్రజా దర్బార్‌లో వచ్చిన సమస్యలు పరిష్కరించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ రాంబార్కి శరత్ బాబు, కమిషనర్ రామలక్ష్మి, వివిధ శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎమ్మెల్యేలు

విజయనగరంకోట : నగరంలోని టిడిపి కార్యాలయం అశోక్‌బంగ్లాలో శుక్రవారం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి ప్రజాదర్బార్ నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజాదర్బార్‌కు వచ్చిన వినతుల్లో ప్రధానంగా సంతకాల వంతెన మీద నుంచి విజయనగరం టౌన్ లోకి అదే విధంగా రైల్వేస్టేషన్ వైపు, ఎస్‌పి బంగ్లా వైపు వెళ్లే వాహనాలకు సిగ్నల్స్ సరిగ్గా కనబడకపోవడంతో ప్రధాన సమస్యగా ఉందని వినతి ఇచ్చారు. దీనికి ప్రధాన కారణం నాలుగు సెంటర్లు కూడలిలో గతంలో ఏర్పాటు చేసిన టీకప్పు ప్రధాన సమస్యగా ఉంది దాన్ని తొలగించి సిగ్నల్స్ సక్రమంగా కనబరినట్లు చేయాలని పేర్కొన్నారు. విజయనగరం మండలం గుంకలాం గ్రామ ప్రజలు మరో అదనపు వాటర్ ట్యాంక్ కావాలని వినతి అందజేశారు. వైఎస్ఆర్ నగర్ ప్రజలు తమ వార్డుతో కలిపి ఉన్న రాళ్ల వీధిని వేరుచేసి ప్రత్యేక వార్డుగా చేయాలని కోరుతూ వినతి సమర్పించారు, వీటితోపాటు విజయనగరం పట్టణ, మండల పరిధిలో రోడ్లను ఏర్పాటు చేయాలని వినతులు అందజేశారు, కొత్త పింఛన్లను ఇప్పించాలని కోరుతూ పలువురు వినతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ ప్రజల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కారం చేయడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రసాదుల లక్ష్మి వరప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు గంటా రవి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పాశి అప్పలనాయుడు, మండల, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.



అర్జీదారులతో మాట్లాడుతున్న విజయనగరం ఎమ్మెల్యే అదితి

భోగాపురం : మండలంలోని పోలిపల్లి గ్రామంలో మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు తన ఇంటివద్ద శుక్రవారం ప్రజా దర్బార్ నిర్వహించారు. భూ సమస్యలు, సిసి రోడ్లు, కాలువలు, ఎలక్ట్రికల్, మౌలిక వసతులు, రీసర్వేలో పొరపాట్లపై వినతులు అందాయి. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, జిల్లా అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి, పిడుగు తోటరావు, దాసరి అప్పలస్వామి, తెలుగుయువత పార్లమెంట్ కార్యనిర్వాహక కార్యదర్శి కర్రోతు రాజు, ఎఎంసి డైరెక్టర్ గరి వెంకటరమణ, కవులవాడ ఎంపిటిసి ప్రతినిధి కోరాడ రాము, మండల ఉపాధ్యక్షులు కోలా రామసూరి, పిన్నింటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

అప్పలరాజుపై పీడీ యాక్టును రద్దుచేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

అనకాపల్లి జిల్లా నక్కపల్లి ప్రాంతంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ ఏర్పాటుకు నిరసనగా ప్రజాల పక్షాన నిలబడి ఆందోళనలు చేస్తున్న రైతు సంఘం జిల్లా కార్యదర్శి అప్పలరాజుపై పెట్టిన పీడీయాక్టును రద్దు చేసి, వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యాన శుక్రవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సిపిఎం నాయకులు పి.శంకర్రావు మాట్లాడుతూ రసాయనాల పదార్థాలను ఉత్పత్తి చేస్తూ కాలుష్యం వెదజల్లుతూ ప్రజలకు హాని కలిగిస్తున్న ప్రజల పక్షాన నిలబడడాన్ని ఏ చట్టం కింద నిషేధించారో ప్రభుత్వం తెలపాలని అన్నారు. గూండాలు, రౌడీషీటర్లు, ఆడపిల్లలను అమానుషంగా కబలించే మానవ మృగాలపై కూడా పెట్టని ఇటువంటి చట్టాన్ని ప్రజా సమస్యలపై ఉద్యమించే నాయకులపై బనాయించడం అన్యాయమని అన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అనేక దౌర్జన్యాలును అరికట్టడం, గంజాయి ముఠాలను పట్టుకోవడం చేతకాని ప్రభుత్వానికి ప్రజల హక్కులకోసం పోరాడుతున్న నేతపై దుర్మార్గమైన చట్టాన్ని బనాయించడాన్ని ప్రజలంతా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు సింగిరెడ్డి గోపాలం, జి.వాసు, జి.గౌరి, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా వ్యాప్త ఆందోళనలకు సిపిఎం పిలుపు

విజయనగరం : అనకాపల్లి జిల్లా రైతు సంఘం కార్యదర్శి అప్పలరాజుపై అక్రమంగా పెట్టిన పీడీ చట్టాన్ని ఉపసంహరించాలని, వెంటనే జైలు నుంచి విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు చేపట్టాలని సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ ఆ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. అనకాపల్లి ప్రాంత ప్రజాసమస్యలపై నిరంతరం పోరాడుతున్న అప్పలరాజుపై తప్పుడు కేసులు బనాయించి చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని ఖండిస్తున్నామని తెలిపారు. అప్పలరాజుకు అరెస్టు సందర్భంగా ఇచ్చిన ఆర్డర్‌లో 2013లో మే నుంచి ఈ ఏడాది డిసెంబర్ 10వరకు మొత్తం 19 కేసుల్లో నిందితుడిగా పేర్కొన్నారని, అందులో రెండు కేసుల్లో కోర్టు నిర్దోషిగా తేల్చగా 12కేసులను అప్పటిలోనే మూసివేశారని తెలిపారు. అత్యధిక కేసులు 151 సెక్షన్ కేసులే ఉన్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ప్రజా ప్రయోజనాల కోసం, భూములు కోల్పోతున్న పేద రైతులు, దళితులు, గిరిజన బలహీన వర్గాల వారి కోసం, వృత్తిదారుల ప్రయోజనాల కోసం ప్రజాస్వామ్యయుతంగా, శాంతియుత పద్ధతుల్లో పోరాడుతున్న అప్పలరాజుపై దుర్బుద్ధితో అక్రమంగా పీడీ చట్టం కేసు నమోదు చేశారని పేర్కొన్నారు. చట్టవిరుద్ధంగా బనాయించిన పీడీ చట్టం కేసును ఉపసంహరించి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ అరెస్టుకు నిరసనగా పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టాలని తమ్మినేని పిలుపునిచ్చారు.

జగన్, బొత్సపై
రాజద్రోహం కేసు పెట్టాలి
ఎమ్మెల్యే కళావెంకటరావు

ప్రజాశక్తి-చీపురుపల్లి



ఎమ్మెల్యే కళావెంకటరావు

మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, శాసనమండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ అరాచకాలు సృష్టించేందుకు యత్నిస్తున్నారని, వారిపై రాజద్రోహం కేసు పెట్టాలని ఎమ్మెల్యే కిమిడి కళావెంకటరావు వ్యాఖ్యానించారు. శుక్రవారం చీపురుపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎవరైనా పిపిపిలు చేసుకుంటే వైసిపి అధికారంలోకి వచ్చాక వారిని జైల్లో పెడతామనడం ఏమిటని ప్రశ్నించారు. వలసదారులైన బ్రిటిష్ వారినే ప్రజాస్వామ్యయుతంగా, గాంధీ మార్గంలోనే తరిమికొట్టిన దేశం ఇదని అన్నారు. అలాంటిది ఇష్టం వచ్చినట్లు మాట్లాడటానికి వీల్లేదని, పరిశ్రమలు రాకుండా, రాష్ట్రాభివృద్ధికి ఆటంకంగా మారిన జగన్, బొత్సను రాజద్రోహం కింద బుక్ చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. నమ్మిన సిద్ధాంతానికి నక్సలైట్లు పుడతారని జగన్ చెబుతున్నారని, నక్సలైట్లతో ఆయన్ను పోల్చుకోవడం విడ్డూరంగా ఉందని అన్నారు. రాజకీయ అరాచకవాదులు తీవ్రవాదులు కన్నా దేశానికి, రాష్ట్రానికి, ప్రజలకు ప్రమాదకరమని, ఇటువంటి వారిని శిక్షించాల్సిందేనని చెప్పారు. సమావేశంలో టిడిపి నాయకులు రౌతు కామునాయుడు, సారిపాక సురేష్, సన్యాసినాయుడు, రెడ్డి గోవిందనాయుడు, రేగాన రామారావు తదితరులున్నారు.

ఎమ్మెల్యేని కలిసిన ఎపిఎన్‌జిఒ నాయకులు

ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ చీపురుపల్లి తాలూకా నూతన కమిటీ నాయకులు ఎమ్మెల్యే కళావెంకటరావును శుక్రవారం కలిసి పుష్ప గుచ్ఛమిచ్చి సన్మానించారు. అనంతరం కళావెంకటరావు నూతన కమిటీ సభ్యులను పరిచయం చేసుకున్నారు.

పిల్లలే వికసిత్ భారత్‌కు పునాది

కలెక్టర్ రామసుందర్ రెడ్డి • ఘనంగా వీర బాల దివస్

ప్రజాశక్తి-కంటోన్మెంట్



వీర బాల దివస్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రామసుందర్ రెడ్డి, ఐసిడిఎస్ పీడీ విమలారాణి, తదితరులు

భారత భవిష్యత్తుకు మూలస్తంభాలైన బాలలను గౌరవిస్తూ, వారిలో స్ఫూర్తిని నింపేందుకు ఉద్దేశించిన 'వీర్ బాల్ దివస్' వేడుకలు జిల్లాలో శుక్రవారం ఘనంగా జరిగాయి. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి, ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి. విమలారాణి, ఇతర జిల్లా అధికారులు జాతీయ స్థాయి ప్రత్యక్ష ప్రసారాన్ని వీక్షించారు. వీర్ బాల్ దివస్‌కు సంబంధించిన పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. భారతదేశ భవిష్యత్తుకు పునాది అయిన పిల్లలను గౌరవించడం ఈ వేడుకల ముఖ్య ఉద్దేశమని కలెక్టర్ అన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కళాశాలలు, క్రీడా సంస్థలు, శిశు సంరక్షణ సంస్థలు, యువజన సంఘాల్లో ఈ వేడుకలు నిర్వహించాలన్నారు. విద్యార్థుల వయస్సును బట్టి పెయింటింగ్, వ్యాసరచన, కథలు చెప్పడం, క్విజ్, గ్రూపు చర్చలు, మరియు స్కిట్స్ వంటి విభిన్న కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 26 నుండి 30వరకు జిల్లా, మండల స్థాయిల్లో ఎన్.సి.సి, ఎన్.ఎస్.ఎస్ క్యాడెట్లు, వివిధ ప్రభుత్వశాఖల సమన్వయంతో అవగాహన ర్యాలీలు, వాకథాన్‌లు నిర్వహిస్తారని తెలిపారు. న్యూఢిల్లీలో జరిగిన ఈ జాతీయ స్థాయి వీరబాల దివస్ వేడుకల్లో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా అవార్డుల ప్రదాన కార్యక్రమం జరిగింది. జిల్లాలోని డి.పి.ఒలు, సి.డి.పి.ఒలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, స్వయం సహాయక సంఘాలు, పంచాయతీ ప్రతినిధులు వీక్షించారు. కార్యక్రమంలో పలువురు సిడిపిఒలు, డిసిపిఒ బిహెచ్ లక్ష్మి, డీఎంసీ సుజాత, ఒన్ స్టాప్ సెంటర్ అడ్మిన్ సాయి విజయలక్ష్మి, సూపర్వైజర్లు ఇతర సిబ్బంది, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఆకతాయిల భరతం పట్టేందుకు 'శక్తి టీమ్స్'
ఆరుగురు సభ్యులతో ఐదు బృందాలు

ప్రజాశక్తి- కంటోన్మెంట్

జిల్లాలో మహిళలపై జరుగుతున్న దాడులు, ఆకతాయిల వేధింపులను నియంత్రించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు శక్తి టీమ్స్‌ను ఏర్పాటు చేశామని ఎస్‌పి ఎఆర్ దామోదర్ తెలిపారు. ఈ టీములు జిల్లాలోని కళాశాలలు, ముఖ్య కూడళ్లను మఫ్టీలో సందర్శించి, మహిళలను వేధించే ఆకతాయిలను గుర్తించి, వారిపై చట్టపరమైన చర్యలు చేపడుతున్నామన్నారు. విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, పోక్సో చట్టాల గిరించి అవగాహన కలిపిస్తున్నామన్నారు. విజయనగరం, బొబ్బిలి మరియు రాజాం పట్టణాలలో ఆరుగురు పోలీసు సిబ్బందితో ఐదు బృందాలుగా 30 మందితో శక్తి టీమ్‌లు ఏర్పాటు చేసామని, ఒక్కొక్క బృందానికి ఎస్‌ఐ నాయకత్వం వహిస్తున్నారని తెలిపారు. శక్తి ఎస్ఒఎస్ కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ బృందాలు స్కూల్స్, కళాశాలలను సందర్శించి విద్యార్థినులు, ఉపాధ్యాయులతో శక్తి వారియర్స్‌గా కొన్ని బృందాలను నియమిస్తున్నామన్నారు.

అనాథ చిన్నారులకు కలెక్టర్ అండ

ఇల్లు, హాస్టల్ సీట్ల మంజూరుకు హామీ • 'ప్రజాశక్తి' కథనానికి స్పందన



జన్నివలస అనాథ చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రామసుందర్‌రెడ్డి

ప్రజాశక్తి-జామి

తల్లితండ్రులను కోల్పోయి అనాథలుగా మారిన జన్నివలస గ్రామానికి చెందిన ఇద్దరు బాలురకు జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డి అండగా నిలిచారు. వారికి ఇళ్ల మంజూరు చేయడమే కాకుండా, చదువుకొనేందుకు సహకరిస్తామని, హాస్టల్ సీట్లను మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. జామి మండలం జన్నివలస గ్రామానికి చెందిన మైలపల్లి విజయ్(12), గౌతమ్(10) కొద్ది కాలంలోనే తల్లితండ్రులకు కోల్పోయారు. వారి చిన్నతనంలోనే తండ్రి కేన్సర్‌తో మరణించగా, తల్లి ఆరు నెలల క్రితం గుండెపోటుతో మృతి చెందింది. దీంతో అనాథలుగా మారిన ఈ బాలురు ఇద్దరూ తమ పెద్దమ్మ ఎద్దు కొండమ్మ ఇంటివద్ద ఆశ్రయం పొందుతున్నారు. విజయ్ జామి జిల్లా పరిషత్ పాఠశాలలో 7వ తరగతి, గౌతమ్ గ్రామంలోని ఎంపిపి పాఠశాలలో 5వ తరగతి చదువుతున్నారు.

ఈ విషయమై ఈనెల 25న పాపం పసివాళ్లు.. శీర్షికన ప్రజాశక్తిలో కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ వెంటనే జామి తహశీల్దార్‌కు చెప్పి జన్నివలసలో ఆ చిన్నారుల వద్దకు పంపించారు. త్వరలోనే నేరుగా కలుస్తానని భరోసా ఇచ్చారు. ఈనేపథ్యంలోనే ఐసిడిఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ టి.విమలారాణి ద్వారా ఈ బాలురిద్దరూ తమ పెద్దమ్మతో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్‌ను కలుసుకున్నారు. వీరి దయనీయ పరిస్థితిని తెలుసుకున్న జిల్లా కలెక్టర్ రామసుందర్ రెడ్డి చలించిపోయి, వారికి అన్నివిధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల మంజూరు చేస్తామని, హాస్టల్ సీట్లను కేటాయిస్తామని చెప్పారు. బాగా చదువుకొని వృద్ధిలోకి రావాలని ఆ బాలురకు కలెక్టర్ సూచించారు.

మిల్లర్లు బీజీలు సమర్పించాలి

ప్రజాశక్తి-గంట్యాడ



మిల్లులో తనిఖీలు చేస్తున్న జెసి ఎస్.సేధు మాధవన్

రైస్ మిల్లర్లు వెంటనే తమ బ్యాంకు గ్యారంటీలను సమర్పించాలని జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్ ఆదేశించారు. ఆయన శుక్రవారం గంట్యాడ మండలంలో పర్యటించారు. రావివలసలోని కనకదుర్గ రైస్ మిల్లు, సిరిపురంలోని శ్రీనివాస రైస్ మిల్లులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ మిల్లర్లు వారి టార్గెట్ మేరకు బిజీలు వెంటనే ఇవ్వాలని, నిబంధనల మేరకు ధాన్యం సేకరణ జరగాలని ఆదేశించారు. మరపట్టిన ధాన్యాన్ని పౌరసరఫరాల కార్పొరేషన్‌కు, ఫుడ్ కార్పొరేషన్ ఇండియాకు వెంటనే పంపాలని ఆదేశించారు. అనంతరం మురపాక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఎలాంటి ఆలస్యమూ చేయకుండా రైతులకి ట్రక్ షీట్లు జనరేట్ చేయాలని, ఫండ్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లను కూడా వెంటనే రైతు పేరు మీద జనరేట్ చేయాలని ఆదేశించారు. పర్యటనలో తాహశీల్దార్ నీలకంఠేశ్వరరెడ్డి, సివిల్ సప్లై డిప్యూటీ తాహశీల్దార్ మూర్తి, వ్యవసాయ అధికారి శ్యామ్, కస్టోడియన్ ఆఫీసర్లు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

పశు సంచారంపై చర్యలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పలుచోట్ల రహదారులపై విచ్చలవిడి పశు సంచారంపై నగరపాలక సంస్థ మరియు పోలీసు సిబ్బంది సంయుక్తంగా శుక్రవారం కొరడా ఝులిపించారు. రహదారులపై సంచరిస్తున్న పశువులను అదుపులోకి తీసుకొని, పశు యజమానులకు అపరాధ రుసుము విధించారు. కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో పశు సంచారం అదుపునకు అవసరమైన అన్ని చర్యలను పకడ్బందీగా చేపడుతున్నామన్నారు. పశువులను గోశాలలకు తరలిస్తామని చెప్పారు. ఈ విషయమై పలుమార్లు పశు యజమానులతో సమావేశం ఏర్పాటు చేసి తెలియజేశామన్నారు. అయినా కొంతమంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పశువులను రహదారులపై విడిచిపెడుతున్నారన్నారు. ఈ పరిస్థితిని చాలా తీవ్రంగా పరిగణిస్తూ పశు సంచారన్ని నిరోధించేందుకు చర్యలు చేపడుతున్నామని కమిషనర్ నల్లనయ్య వివరించారు.

ఆర్‌ఎస్‌కెకు విద్యుత్తు అంతరాయం

ప్రజాశక్తి- మెంటాడ

మెంటాడ రైతు సేవా కేంద్రానికి గత వారం రోజులుగా విద్యుత్తు సౌకర్యంలో అంతరాయం కలుగుతోంది. ధాన్యం కొనుగోలు సిబ్బంది విద్యుత్తు అధికారులకు ఫిర్యాదు చేస్తే వారు వచ్చి ఎప్పటికప్పుడు మరమ్మతులు చేస్తున్నారు. రాత్రి వేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు రైతు సేవా కేంద్రానికి సరఫరా వచ్చే విద్యుత్ వైర్లను తొలగిస్తున్నారు. దీంతో రైతులకు ట్రక్‌షీట్‌ల నమోదులో జాప్యమవుతోందని సిబ్బంది చెబుతున్నారు. దీనిపై నిఘా పెట్టి ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని పలువురు రైతులు కోరుతున్నారు.

ఖోఖోలో జిల్లాకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 24 నుండి 26 వరకు గుడివాడలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ స్త్రీ పురుషుల అంతర్ జిల్లా ఖోఖో టోర్నమెంట్లో విజయనగరం పురుషుల జట్టు ద్వితీయ స్థానం సాధించింది. ఈ బహుమతిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము చేతుల మీదుగా క్రీడాకారులు అందుకున్నారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పురుషుల జట్టు సభ్యులకు జిల్లా ఖోఖో అసోసియేషన్ గౌరవాధ్యక్షులు, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి.విజయలక్ష్మి, ఎఎంవి కమలనాభరావు, కె.గోపాల్ అభినందనలు తెలిపారు.



డైవర్షన్ పనులు చేపడుతున్న పొక్లెయినర్

కల్వర్టు నిర్మాణానికి రూ.91 లక్షలు మంజూరు

'ప్రజాశక్తి' కథనానికి స్పందన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని కృష్ణరాయుడిపేట వద్ద రైవాడ కాలువపై కల్వర్టు నిర్మాణానికి జివిఎంసి అధికారులు రూ.91 లక్షలు మంజూరు చేశారు. రైవాడ జలాశయం నుంచి విశాఖపట్నానికి నీరు తరలించే కాలువపై కృష్ణరాయుడిపేట వద్ద ఏర్పాటు చేసిన కల్వర్టు శిథిలావస్థకు చేరింది. కల్వర్టు ఎప్పుడు కూలిపోతుందోనని ప్రజాశక్తి దినపత్రికలో పలుమార్లు కథనాలు రావడంతో జివిఎంసి అధికారులు స్పందించారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి, కల్వర్టు నిర్మాణానికి రూ.91 లక్షలు నిధులు మంజూరు చేశారు. దీంతో రాకపోకలకు ఇబ్బంది లేకుండా డైవర్షన్ రహదారి నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించారు.

పాఠశాలలను సందర్శించిన డిఇఒ

విద్యార్థుల అభ్యసన స్థాయి పరిశీలన

ప్రజాశక్తి-విజయనగరంటౌన్, గుర్ల



విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ మాణిక్యంనాయుడు

విజయనగరం, గుర్ల మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను జిల్లా విద్యాశాఖ అధికారి యు.మాణిక్యం నాయుడు శుక్రవారం సందర్శించారు. పాఠశాల విద్యా వ్యవస్థ, బోధన విధానాలు, విద్యార్థుల అభ్యాసన స్థాయిపై పరిశీలించారు. 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు విద్యార్థులను ప్రత్యక్షంగా ప్రశ్నించి వారి విషయ అవగాహన, చదవు సామర్థ్యం, విశ్లేషణాత్మక ఆలోచన శక్తులను పరిశీలించారు. ముఖ్యంగా 10వ తరగతి విద్యార్థులను సిలబస్ వారీ ప్రశ్నించి, వార్షిక పరీక్షలకు వారి సన్నద్ధత స్థాయిని అంచనా వేశారు. విద్యార్థులు మరింత కష్టపడి చదవాలని, క్రమశిక్షణతో లక్ష్యాన్ని దృష్టిలో పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి, స్లిప్ టెస్ట్ పరీక్షలను క్రమం తప్పకుండా నిర్వహించాలని ఆదేశించారు.

వందరోజుల యాక్షన్ ప్లాన్‌ను సమర్థవంతంగా అమలు చేసి, ప్రతి విద్యార్థి అభ్యాస ఫలితాలు మెరుగుపడేలా చూడాలని హితవు పలికారు. పాఠశాల పరిసరాల పరిశుభ్రత, విద్యార్థుల హాజరు శాతం, రికార్డుల నిర్వహణ, బోధనకు అవసరమైన సౌకర్యాలపై కూడా సమీక్ష నిర్వహించి, అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమంలో గుర్ల ఎంఇఒ ఎస్.భానుప్రకాశ్, ప్రధానోపాధ్యాయులు ఆర్.సంగంనాయుడు పాల్గొన్నారు.



భోగాపురంలో ప్రచారం నిర్వహిస్తున్న సిఐటియు నాయకులు

మహాసభను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి-భోగాపురం

విశాఖలో జరిగిన సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చెయ్యాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.సూర్యనారాయణ కోరారు. శుక్రవారం భోగాపురం ఆటో స్టాండ్ వద్ద బ్యానర్‌తో ప్రచారం చేశారు. జనవరి నాలుగో తేదిన విశాఖ ఆర్‌కె బీచ్‌లో జరిగే బహిరంగ సభకు అధిక సంఖ్యలో కార్మికులు, ప్రజలు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనం రమణ, పెద్ద అప్పారావు, కొల్లి అప్పారావు, కోరాడ రాము, కొల్లి శ్రీను పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రజలకు మెరుగైన సేవలు అందించడానికి ఎప్పటికప్పుడు పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంతో ఆర్‌టిసి సేవలను అందుబాటులోకి తీసుకువస్తున్నామనిప్రజా రవాణా అధికారి వరలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. ఇదివరకే వాట్సాప్ ద్వారా టికెట్లు బుకింగ్‌తో పాటుగా కేన్సిలేషన్ కూడా చేసుకోవచ్చని తెలిపారు. వీటితో పాటు బొబ్బిలి, విజయనగరం, రాజాం, శృంగవరపుకోట పరిధిలో ప్రజలు సాంకేతికతను ఉపయోగించుకొని తమ రవాణా సమస్యలను 9552300009 ద్వారా తెలియజేస్తే పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలను అందించడానికి కృషి చేస్తామని తెలిపారు.



ప్రేమ్‌చంద్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్సీ రఘురాజు

ప్రేమ్‌చంద్‌కు అభినందన

ప్రజాశక్తి-శృంగవరపుకోట

యూత్ ఏషియన్ పారా బ్యాడ్మింటన్ ఛాంపియన్ షిప్‌లో వేపాడ మండలం రామస్వామిపేటకు చెందిన పొట్నూరు ప్రేమ్‌చంద్ బంగారు పతకం సాధించడంతో శుక్రవారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు పి.శ్రీరాములు పాల్గొన్నారు.

టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా రమాదేవి

ప్రజాశక్తి-చీపురుపల్లి



టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శిగా ముల్లు రమాదేవి నియమితులయ్యారు. గరివిడి మండలం కుమరాం సర్పంచ్‌గా రమాదేవి కొనసాగుతున్నారు. రమాదేవి భర్త ముల్లు రమణ టిడిపి బిసి సెల్ నియోజకవర్గ అధ్యక్షులుగా పని చేస్తున్నారు. రమాదేవి మాట్లాడుతూ తనపై నమ్మకంతో పదవిని ఇవ్వడంతో తన బాధ్యత మరింత పెరిగిందన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కళావెంకటరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ్‌మల్లిక్ నాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు.

టిడిపి జిల్లా ఉపాధ్యక్షులుగా వాసుదేవరావు

ప్రజాశక్తి-వంగర



టిడిపి విజయనగరం జిల్లా ఉపాధ్యక్షులుగా బొత్స వాసుదేవరావు నాయుడు నియమితులయ్యారు. గతంలో ఆయన జెడ్‌పిటిసి, ఎంపిపిగా పనిచేశారు. టిడిపిలో సుదీర్ఘ కాలం పాటు పనిచేసిన ఆయనకు జిల్లా ఉపాధ్యక్షులు పదవి రావడంతో పలువురు అభినందించారు.

యుటిఎఫ్ నెల్లిమర్ల మండల కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి-నెల్లిమర్ల

స్థానిక రామతీర్థం జంక్షన్‌లోని ఎంపిపి పాఠశాలలో శుక్రవారం యుటిఎఫ్ నెల్లిమర్ల మండల కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికైంది. జిల్లా కార్యదర్శి పతివాడ త్రినాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రక్రియకు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాస రావు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. మండల గౌరవ అధ్యక్షులుగా గాడు పరమేశ్వర రావు, అధ్యక్షులుగా మద్దిల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా జి.పి.నాయుడు, సహాధ్యక్షులుగా ఎస్.రాజేంద్ర ప్రసాద్, ఆర్.చంద్రకళ, కోశాధికారిగా సుంకరి చలపతిరావు ఎన్నికయ్యారు.

సంతలో మౌలిక సౌకర్యాలు మెరుగుపరచాలి

ప్రజాశక్తి-దత్తిరాజేరు

పశువులకు సంతలో మౌలిక సదుపాయాలు మెరుగు పరచాలని డిప్యూటీ ఎంపిడిఒ మనోరమ అన్నారు. శుక్రవారం పెదమానాపురం పంచాయతీ కార్యదర్శి సమక్షంలో సంతలో వివిధ శాఖ అధికారులతో సర్పంచ్ గొటివాడ సుందరమ్మ అధ్యక్షతన సంత నిర్వహణపై కమిటీ సమావేశం నిర్వహించారు. ప్రతి శనివారం సంతలో నిర్వహణ దృశ్యాలను వాట్సాప్ ద్వారా కమిటీ సభ్యులకు తెలియజేయాలన్నారు. సంతకు వచ్చిన, అమ్మిన పశువులతోపాటు రైతుల వివరాలు నమోదు చేయాలన్నారు. సమావేశంలో ఎంవిఐ ఉష, ఆర్ఐ నారాయణరావు, పశువైద్యాధికారి అవినాష్, ఎఎస్ఐ, తదితరులు పాల్గొన్నారు.

చిరస్మరణీయులు సూరిబాబు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

కార్మిక సంక్షేమాభిలాషి నల్లి అప్పల సూర్యనారాయణ (సూరిబాబు) చిరస్మరణీయులని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు అన్నారు. శుక్రవారం సూరిబాబు ఏడో వర్ధంతిని జరజాపుపేటలో కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో ఏర్పాటుచేశారు. ఆటో స్టాండ్ కూడలిలో సూరిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మద్దిల సన్యాసిరావు, అవనాపు సత్యనారాయణ, ఎం.ఎం.నాయుడు, నల్లి శేఖర్, కిల్లంపల్లి రామారావు, నల్లి శ్రీను, తుమ్మి నారాయణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

28న కబడ్డీ జట్ల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనవరి 2 నుండి 4 వరకు పశ్చిమగోదావరి జిల్లా వీరవాసంలో జరగబోయే 72వ రాష్ట్రస్థాయి మహిళల అంతర్ జిల్లాల కబడ్డీ పోటీలలో పాల్గొనే విజయనగరం జిల్లా జట్టు ఎంపిక ఈనెల 28 ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు కస్పా హైస్కూల్‌లో జరుగతుందని కబడ్డీ జిల్లా సంఘ అధ్యక్ష కార్యదర్శులు ఎ.రంగారావు దొర, కెవి ప్రభావతి, ఆర్గనైజింగ్ కార్యదర్శి నడిపేన లక్ష్మణరావు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు హాజరు కావాలని కోరారు.

గడ్డివాము దగ్ధం

ప్రజాశక్తి-శృంగవరపుకోట

మండలంలోని కొత్తకోట గ్రామానికి చెందిన కొరమాని కోటూరావుకు చెందిన గడ్డిగాము శుక్రవారం దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. గడ్డి విలువ సుమారు రూ.15 వేలు ఉంటుందని ఫైర్ ఆఫీసర్ మదీనా తెలిపారు.

జగనన్న కాలనీలో మొండిగోడలే

అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన వైనం



అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారిన జగనన్న కాలనీ ఇదే

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో ఉంటున్న నిరు పేదలను గుర్తించి వైసిపి ప్రభుత్వం హయాంలో వేపాడకు రెండు కిలోమీటర్ల దూరంలో జగనన్న కాలనీ ఏర్పాటు చేశారు. వేపాడకు దూరంగా బక్కునాయుడుపేట వద్ద జగనన్న కాలనీ నిర్మాణానికి స్థలం కేటాయించారు. దీంతో చాలా మంది ఊరు నుంచి దూరంగా ఉందన్న కారణంతో ఇంటి నిర్మాణానికి ముందుకు రాలేదు. మరి కొంత మంది ముందుకొచ్చినా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయలేకపోయారు. దీంతో ప్రస్తుతం మొండిగోడలతో ఉన్న జగనన్న కాలనీ మందు బాబులకు అడ్డాగా మారింది. అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారి అటువైపు వెళ్లేందుకు భయపడే విధంగా తయారైంది.

వేపాడ గ్రామ సచివాలయం పరిధిలో వేపాడ గ్రామానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో బక్కు నాయుడుపేట వద్ద గల మెట్టను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో గతంలో వైసిపి ప్రభుత్వం 50 మంది నిరుపేదలను గుర్తించి ఇళ్ల స్థలాలు మంజూరు చేసింది. వీరిలో సగం మందికిపైగా అక్కడ ఇంటి నిర్మాణాలకు ఆసక్తి చూపలేదు. పునాదులు తీయడానికి తవ్వగా కింద రాళ్లు రావడంతో మరి కొంత మంది వెనకడుగు వేశారు. ఇంకొంత మంది నింటల్ లెవెల్ వరకూ నిర్మించి పనులు ఆపేయడంతో పిచ్చి మొక్కలు, పొదలు వేపుగా పెరిగి భయంకరంగా తయారైంది. వీటి మధ్య నివసించేందుకు మరికొంత మంది ఇబ్బందులు పడుతున్నారు. జగనన్న కాలనీకి తాగునీటి కోసం ఏర్పాటు చేసిన బోరు నిరుపయోగంగా మారడంతో తాగునీటి కష్టాలు పడుతున్నారు. ఈ ప్రభుత్వమైనా లబ్ధిదారులకు అనువైన చోట ఇళ్లను నిర్మించి ఇస్తే బాగుంటుందని కొత్తగా ఇంటి నిర్మాణాలకు దరఖాస్తులు పెట్టుకుంటున్న వారు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఈ విషయంపై హౌసింగ్ ఎఇ గంగాధర్‌ను వివరణ కోరగా ఇంటి నిర్మాణాలు చేస్తే కచ్చితంగా బిల్లులు వచ్చేలా చేస్తామని, కానీ బక్కునాయుడు పేట వద్ద ఇచ్చిన జగన్నన కాలనీలో నిర్మాణాలకు ఎవరూ ముందుకు రావడం లేదని చెప్పారు.

పశు గ్రాసం పెంపకానికి దరఖాస్తులు స్వీకరణ

జెడి మురళీకృష్ణ



రికార్డులను తనిఖీ చేస్తున్న జెడి మురళీకృష్ణ

ప్రజాశక్తి-గంట్యాడ

జిల్లాలో పాల ఉత్పత్తిని పెంచడానికి పశు గ్రాసం పెంపకం కోసం పాడి రైతుల దగ్గర నుంచి దరఖాస్తులను స్వీకరించాలని పశు సంవర్ధక శాఖ జెడి కె.మురళీకృష్ణ తెలిపారు. శుక్రవారం గంట్యాడ, బోనంగి గ్రామాల్లో పశు వైద్య కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో పశువుల పెంపకానికి వసతిగృహాలను నిర్మించనున్నట్లు తెలిపారు. హరిత గోపాల పథకం కింద పాలు ఉత్పత్తిని పెంచాలనే ఉద్దేశంతో పశు గ్రాసం పెంచడానికి ఉపాధి హామీ ద్వారా పాడి రైతులకు నిధులు అందించనున్నట్లు తెలిపారు. అందుకోసం పాడి రైతుల నుంచి దరఖాస్తులను స్వీకరించాలని సిబ్బందిని ఆదేశించారు. పెయ్యిదూడల పథకం ద్వారా ఆడపెయ్యిల కోసం జిల్లాలో తొమ్మిది వేల ఇంజెక్షన్లు చేయడం లక్ష్యం కాగా, ఆరు వేల ఇంజెక్షన్లు చేసినట్లు చెప్పారు. జనవరిలో మెగా పశుగర్భ కోస శిబిరాలను, లేగదూడల ప్రదర్శనలను ప్రతి మండలంలోనూ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పాడి రైతులకు పశు కిసాన్ క్రెడిట్ కార్డులకు 5 వేల దరఖాస్తులు సమర్పించగా, 725 మంది రైతులకు రుణాలను ఇప్పించినట్లు చెప్పారు. గతేడాదిలో 7.52 లక్షల మెట్రిక్ టన్నుల పాల ఉత్పత్తి కాగా, ఈ ఏడాది 8.36 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచడానికి కృషి చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో ఎడి రెడ్డి కృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

29న తాళ్లపేట గ్రామసభ



ఎంపిడిఒతో మాట్లాడుతున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

ఎట్టకేలకు మండలంలోని వెంపడాం పంచాయతీ పరిధిలోని తాళ్లపేటలో ఈ నెల 29న గ్రామసభ పెట్టేందుకు అధికారులు అంగీకరించారు. తమకు ప్రత్యేక పంచాయతీ కావాలంటూ తాళ్లపేట గ్రామస్తులు కోరుతున్న విషయం తెలిసిందే. శుక్రవారం మరోసారి గ్రామస్తులు ఎంపిడిఒ రాధిక, ఇఒపిఆర్‌డి జ్ఞానేశ్వరరావు, కార్యదర్శి సంతోషిని ముట్టడించారు. గ్రామసభ ఎందుకు పెట్టడం లేదని అడిగారు. సోమవారం పిజిఆర్ఎస్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకుండా పిజిఆర్ఎస్ అర్జీ ఎలా మూసేస్తారని ప్రశ్నించారు. సర్పంచ్ కుమార్ అనుమతి లేకుండా గ్రామసభ పెట్టలేమని ఎంపిడిఒ రాధిక తెలిపారు. డిపిఒ డైరెక్షన్‌తోనే గ్రామసభ ఏర్పాటు చేస్తామన్నారు. ఇలా వాయిదాలు వేస్తే సమయం ముగిసిపోతుందని, ఇప్పుడే గ్రామసభ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు పట్టుబట్టారు. దాంతో ఇఒపిఆర్‌డి డిపిఒతో ఫోన్‌లో మాట్లాడారు. గ్రామసభ పెట్టేందుకు సర్పంచి ఒప్పుకోవడం లేదని తెలిపారు.

దీంతో డిపిఒ స్పందించి గ్రామసభ పెట్టాలని చెప్పడంతో ఈ నెల 29న తాళ్లపేటలో ఏర్పాటుకు అంగీకరించారు. దాంతో వారంతా వెనుదిరిగారు. గ్రామపెద్దలు వాళ్లె అక్కునాయుడు, వాళ్లె సత్యనారాయణ, పిన్నింటి యల్లనాయుడు తదితరులు ఉన్నారు.

సమయపాలన పాటించాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఎంపిడిఒ సూర్యనారాయణ

ప్రజాశక్తి-వేపాడ

సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ ఆదేశించారు. శుక్రవారం మండలంలోని వావిలపాడు, వీలుపర్తి గ్రామ సచివాలయాలను ఆయన సందర్శించారు. సకాలంలో విధులకు హాజరుకావాలని సిబ్బందికి సూచించారు. ఉపాధి హామీ వేతనదారులు వంద రోజులు పని పూర్తి చేయాలని, జాబ్ కార్డులు ఉన్న వారంతా పనికి వచ్చే విధంగా ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లు కృషి చేయాలని చెప్పారు. ప్రతిఒక్కరూ రోజుకు 307 రూపాయలు వేతనం పొందే విధంగా పని చేయాలని వేతనదారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి-గంట్యాడ

మండలంలోని నరవ, నీలావతి సచివాలయాలను శుక్రవారం ఎంపిడిఒ ఆర్‌వి రమణమూర్తి సందర్శించారు. రికార్డులను తనిఖీ చేశారు. కొంతమంది సిబ్బంది కార్యాలయంలో లేకపోవడంతో మిగతా వారిని ఆరాతీశారు. జెఎల్ఎం పూర్ణసాయి, నీలావతి సచివాలయంలో సర్వే అసిస్టెంట్ షేక్ రఫీ వివరాల రికార్డులు లేకపోవడంతో మండిపడ్డారు.

29న రేగిడి మండల సమావేశం

ప్రజాశక్తి-రేగిడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఈనెల 29న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కుమారి ఒక ప్రకటనలో తెలిపారు. గత సమావేశంలో లేవనెత్తిన సమస్యల్లో ఎన్ని పరిష్కరించారు? ఇంకా ఎన్ని పూర్తి చేయాలో పూర్తి సమాచారంతో రావాలని సూచించారు. మండల స్థాయి ప్రజాప్రతినిధులు, సభ్యులు, అధికారులు సమయానికి హాజరుకావాలని, సభ్యులు కాని వారు రావద్దని కోరారు.

రీసర్వే గ్రామసభలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలో నల్లబెల్లి, చామలాదేవి అగ్రహారం గ్రామాల్లో సమగ్ర భూ రీసర్వే గ్రామసభలను శుక్రవారం ఏర్పాటుచేశారు. ఈ గ్రామసభల వల్ల రైతులకు కలిగే ప్రయోజనాలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.రాములమ్మ, డిప్యూటీ తహశీల్దార్ రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సామాజిక తనిఖీలు

ప్రజాశక్తి-వేపాడ

సోంపురం, అరిగిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ సోషల్ ఆడిట్ బృందం శుక్రవారం తనిఖీలు చేపట్టింది. రికార్డులను పరిశీలించింది. అనంతరం గ్రామసభ నిర్వహించారు. ఆడిట్ బృందంతోపాటు ఉపాధి హామీ ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పేలుడు పదార్థాలు నిర్వీర్యం

ప్రజాశక్తి-వేపాడ

2018లో మండలంలో రామస్వామిపేట క్వారీకి తరలిస్తున్న పేలుడు పదార్థాలను వల్లంపూడి పోలీసులు పట్టుకుని, స్వాధీనం చేసుకున్నారు. న్యాయ ప్రక్రియ ముగియడంతో శుక్రవారం 15 టన్నుల పేలుడు మిశ్రమాన్ని నిబంధన ప్రకారం కరకవలస పరిధిలో నిర్వీర్యం చేశారు. ఎస్.కోట రూరల్ సిఐ ఎల్.అప్పలనాయుడు, ఎస్ఐ సుదర్శనరావు, ఆర్ఐ టి.శ్రీనివాసరావు పర్యవేక్షించారు.ఈ సందర్భంగా సిఐ అప్పలనాయుడు మాట్లాడుతున్న అనుమతులు లేకుండా పేలుడు పదార్థాలు తరలించినా, క్వారీల్లో వినియోగించినా చర్యలు తప్పవని హెచ్చరించారు.

పాఠశాల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సోంపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మండల ప్రత్యేకాధికారి పి.ఎన్.వి.లక్ష్మీనారాయణ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి 100 రోజుల కార్యాచరణ రికార్డుల, విద్యార్థుల సైకిల్ 1, 2 పరీక్షల మార్కులు పరిశీలించారు. రైసింగ్ స్టార్ విద్యార్థులకు సూచనలు చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు బిపిఎ రాజు పాల్గొన్నారు.

నీటి పన్నులు చెల్లించండి : కమిషనర్

ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగర ప్రజలు నీటి పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించాలని నగర పాలక సంస్థ కమిషనర్ పి.నల్లనయ్య కోరారు. శుక్రవారం ప్రజాశక్తి దినపత్రికలో నీటి పన్ను బకాయిలపై కోట్లలో ఖర్చు లక్షల్లో వసూళ్లు అనే శీర్షికతో వచ్చిన కథనానికి ఆయన స్పందించారు. నీటి పన్ను చెల్లించడంలో నీటి వినియోగదారులు ముందుకు రాకపోవడం వలన బకాయి ఎక్కువగా ఉంటున్నాయని ప్రజాశక్తికి తెలిపారు. గతం కంటే గత రెండేళ్ల నుంచి పన్ను వసూళ్లు పెరిగాయన్నారు. అయితే పూర్తి స్థాయిలో వసూలు చేయాల్సిన అవసరం ఉందని,అందుకు ప్రజలు సహకరించి పన్ను చెల్లించాలని కోరారు.

పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ ఆవిష్కరణ

పర్యావరణ హితంగా జీవించడానికి పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్ ఉపకరిస్తుందనికమిషనర్ పల్లి నల్లనయ్య పేర్కొన్నారు. శుక్రవారం విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం లో గ్రీన్ క్లైమేట్ టీం ఎన్‌జిఒ ముద్రించిన ప్రపంచ పర్యావరణ దినోత్సవాల క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు. ప్రతి విద్యా సంస్థలో ఈ క్యాలెండర్ వినియోగించి పర్యావరణ దినోత్సవాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ అప్పలరాజు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.ప్రసాద్, విజయనగరానికి చెందిన టెర్రస్ ఉద్యాన్ గ్రూప్ ప్రతినిధులు లలిత, దివ్య, రమేష్, యాక్షన్ ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్ట్స్ ఎన్‌జిఒ అనకాపల్లి జిల్లా హెచ్‌ఆర్ఒ ట్రైనర్ కృష్ణమూర్తి, గ్రీన్ క్లైమేట్ టీం ఎన్జీవో వ్యవస్థాపక కార్యదర్శి జెవి రత్నం, తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీలది కీలకపాత్ర

ప్రజాశక్తి-భోగాపురం



మొబైల్ ఫోన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మాధవి

అంగ న్వాడీ కార్యకర్తలు సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్నారని ఎమ్మెల్యే లోకం మాధవి అన్నారు. శుక్రవారం ఐసిడిఎస్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో అంగన్వాడీలకు మొబైల్‌ఫోన్లు, ప్రీ స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారి వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపిడిఒ కె.గాయత్రి, జనసేన నాయకులు, సిడిపిఒ లావణ్య, సూపర్వైజర్లు, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్పారావుకు పరామర్శ

ప్రజాశక్తి-శృంగవరపుకోట



అప్పారావును పరామర్శిస్తున్న సిపిఐ నాయకులు కామేశ్వరరావు

వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడిన విషయం తెలిసిందే. పట్టణంలోని సాయికృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న అప్పారావును సిపిఐ రాష్ట్ర నాయకులు పి.కామేశ్వరరావు శుక్రవారం పరామర్శించారు. అనంతరం అప్పారావు ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ త్రినాథ్‌తో మాట్లాడారు కార్యక్రమంలో సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి కె.భీముడు ఉన్నారు.

జనసేనలోకి జమ్ము శ్రీను

28న మెసానిక్ టెంపుల్‌లో కార్యక్రమం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

వైసిపి విజయనగరం మండల మాజీ అధ్యక్షులు నడిపేని శ్రీనివాసరావు (జమ్ముశ్రీను), ఆయన కుమార్తె విజయనగరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ నడిపేన శశిభార్గవి జనసేన పార్టీలో చేరనున్నట్లు ప్రకటించారు. ఈనెల 28న మెసానికిక్ టెంపుల్‌లో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా ఇన్‌ఛార్జి పాలవలస యశస్విని సమక్షంలో పార్టీలో చేరనున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. 33ఏళ్లగా రాజకీయాల్లో ఉంటూ పలు పదవులు నిర్వహిస్తూ ప్రజలకు సేవలు అందించానని తెలిపారు. ఏడాది క్రితం వరకు వైసిపిలో కొనసాగానని, తనకుమార్తె ఎఎంసి చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహిస్తోందని తెలిపారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు నచ్చి ఆ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు. తాను, తన కుమార్తెతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపిటిసిలు జనసేనలో చేరుతారని తెలిపారు. సమావేశంలో జనసేన నాయకులు ఆదాడ మోహన్‌రావు, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్ పరిధి బోర్డులు ఏర్పాటు

ప్రజాశక్తి-డెంకాడ

డెంకాడ పోలీస్ స్టేషన్ పరిధిని గుర్తించే బోర్డులను శుక్రవారం భోగాపురం రూరల్ సిఐ జి.రామకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ ఎ.సన్యాసినాయుడు ఏర్పాటు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధి నాలుగు వైపులా విస్తరించి ఉందని, అన్ని వైపులా జాతీయ రహదారులు ఉన్నాయని ఎస్ఐ తెలిపారు. ఈ మార్గాల్లో పోలీస్ స్టేషన్ పరిధి గుర్తించి బోర్డులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జాతీయ రహదారిలో ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే స్థానిక పోలీస్ స్టేషనుకు సమాచారం ఇవ్వడానికి వీలుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



బోర్డులను పరిశీలిస్తున్న సిఐ, ఎస్ఐ



కందికొత్తల పండగను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

కందికొత్తల పండగ ప్రారంభం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గిరిజనుల సాంస్కృతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు కందికొత్తల పండగతో ముడిపడి ఉన్నాయని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. మండలంలోని తాడికొండలో గిరిజనుల సాంప్రదాయ పండుగ కందికొత్తల పండగ వేడుకల్లో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత ఇరిడిలో వెలసిన కప్పరమ్మ తల్లిని కుటుంబ సమేతంగా దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం తాడికొండలో జరుగుతున్న కందికొత్తలు పండుగ సంబరాల్లో పాల్గొన్నారు. గిరిజన సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిన కందికొత్తల పండుగను ప్రతి ఏటా డిసెంబర్ చివరి వారంలో నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని అన్నారు. కొండపోడులో సాగుచేసిన కందులు, జొన్నలు, రాగులు, కొర్రలు, వరి వంటి కొత్త పంటలను ముందుగా గిరిజన దేవతలైన గొడ్డలమ్మ, సతరమ్మలకు నైవేద్యంగా సమర్పించిన అనంతరం వాటిని ఆహారంగా స్వీకరించే సంప్రదాయం ఈ పండగకు ప్రత్యేక అన్నారు. పండగ పూర్తయ్యే వరకు కొత్త పంటను ఆహారంగా తీసుకోరని, గిరిజన సాంప్రదాయాలు, సాంస్కృతి పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే అన్నారు.

కందికొత్తలు సందర్భంగా ఎమ్మెల్యే మహిళలతో కలిసి సంప్రదాయ థింసా నృత్యం చేస్తూ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ప్రజలంతా ఉల్లాసంగా, ఉత్సాహంగా పాల్గొని పండుగను విజయవంతం చేశారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, మండల కార్యదర్శి పోలూరు శ్రీనివాసరావు,నాయకులు బిడ్డిక కొండలరావు, ప్రజాప్రతినిధులు, గిరిజన నాయకులు, మహిళలు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున పాల్గొన్నారు.